సాక్షి
బాపట్ల
శుక్రవారం । 9 । జూన్ । 2023



గాలివాన

సత్తెనపల్లి: సత్తెనపల్లిలో గురువారం రాత్రి గాలివాన కురిసింది. దీంతో పలు చోట్ల చెట్లు కూలిపోయి రాకపోకలకు, కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది.



జూలై 2న దుర్గమ్మకు బోనం

విజయవాడ: హైదరాబాద్ ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో జూలై 2న ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు బంగారు బోనం సమర్పించనున్నారు.



పసుపు కొంటాం

కొల్లిపర: మార్క్‌ఫెడ్ ద్వారా పసుపు కొనుగోలు చేస్తున్నట్లు ఏడీఏ వెంకట్రావు తెలిపారు. గురువారం కొల్లిపరలో ఆయన మార్క్‌ఫెడ్ అధికారులతో కలిసి పసుపు నాణ్యతను పరిశీలించారు.

న్యూస్‌రీల్

మూడు జిల్లాల కార్మిక శాఖ డీసీ బాధ్యతల స్వీకరణ



లక్ష్మీపురం(గుంటూరు): సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల డెప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా పనిచేస్తున్న పి.శ్రీనివాస్‌ను ఏలూరుకు బదిలీ చేస్తూ ఆయన స్థానంలో తెనాలిలో సహాయ కార్మిక కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ధూళిపూడి వెంకట శివ ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు గురువారం మూడు జిల్లాల కార్మిక శాఖ డెప్యూటీ కమిషనర్‌గా ధూళిపూడి వెంకట శివప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు తప్పనిసరిగా కార్మికశాఖ కార్యాలయంలో తమపేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. అసంఘటిత రంగ కార్మికులు తప్పనిసరిగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈ-శ్రమ్ కార్డు పొందాలని చెప్పారు. కార్మికులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకు రావల్సిందిగా కోరారు. కార్మికులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు.

ఏపీ మోడల్ ప్రవేశ పరీక్ష కేంద్రం మార్పు

నరసరావుపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 12న క్రోసూరులో పర్యటిస్తున్న నేపథ్యంలో ఈనెల 11న ఆదివారం క్రోసూరు ఏపీ మోడల్ స్కూలు కేంద్రంగా నిర్వహించనున్న ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశపరీక్షను కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో(కేజీబీవీ)కి మార్చినట్లు కలెక్టర్ ఎల్.శివశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరవుతున్న 196 మంది విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రవాణా సదుపాయం కల్పించాలని, అలాగే రెండు కేంద్రాల వద్ద విద్యార్థుల సౌకర్యార్థం సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,200, గరిష్ట ధర రూ.2,600, మోడల్ ధర రూ.1,700 వరకు పలికింది.

ట్రాక్టర్ ప్రమాద ఘటనలో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: ట్రాక్టర్ ప్రమాద ఘటనకు బాధ్యులైన ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు వట్టిచెరుకూరు ఎస్‌ఐ వి.కలగయ్య తెలిపారు. ఈనెల 5న కొండేపాడు గ్రామస్తులు జూపూడి వెళ్తున్న సమయంలో వట్టిచెరుకూరులో ట్రాక్టర్ బోల్తా పడి ఏడుగురు మహిళలు దుర్మరణం పాలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వట్టిచెరుకూరు పోలీస్ స్టేషన్‌లో 304-ఏ, 304 పార్ట్-2 సెక్షన్ల కింద కేసు నమోదైంది. విచారణ చేపట్టిన గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషా ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ యజమాని జొన్నకూటి శామ్యూల్, డ్రైవర్ కె. ప్రశాంత్‌ను గురువారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. న్యాయమూర్తి వీరిద్దరికీ 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ వి.కలగయ్య తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా ట్రాక్టర్‌ను నడిపినందుకు డ్రైవర్‌ను, లైసెన్సు లేని వ్యక్తికి ట్రాక్టర్‌ను ఇచ్చినందుకు యజమానిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 520.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.60 అడుగుల వద్ద ఉంది.

జగనన్న గోరుముద్ద సరుకులను తీసుకెళ్లాలి

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఈనెల 12న పాఠశాలలు పున:ప్రారంభమవుతున్న నేపథ్యంలో పాఠశాలలకు కేటాయించిన ఫోర్టిఫైడ్ బియ్యం, రాగిపిండి, బెల్లాన్ని సంబంధిత రేషన్ దుకాణాల నుంచి తీసుకెళ్లాలని డీఈవో పి.శైలజ శుక్రవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల పరిధిలో శుక్రవారం ఉదయం 11 గంటలలోపు ఆయా సరుకులను రేషన్ దుకాణాల నుంచి పాఠశాలలకు తీసుకుని వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

● సహజ సంక్షేమశీలి





గుంటూరు జిల్లా నంబూరులోని మదరసాలో ఏర్పాటు చేసిన హజ్ యాత్రా కేంద్రాన్ని గురువారం సాయంత్రం సహజ సంక్షేమశీలి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందర్శించారు. హజ్ యాత్రికులు, ముస్లిం మత పెద్దలతో ఆత్మీయంగా సమావేశమయ్యారు. అనంతరం ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

● స్వచ్ఛమేవ జయతే



క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్)లో భాగంగా ఈ-ఆటోలను తన క్యాంపు ఆఫీసు వద్ద గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. వాటి పనితీరును పరిశీలించారు.

సంక్షేమానికి పారా‘మీటర్’

- పేదల గృహాలకు విద్యుత్ వెలుగులు
- జగనన్న కాలనీల్లో ఉచితంగా మీటర్లు బిగింపు
- జిల్లాలో ఇప్పటికే 3,704 గృహాల నిర్మాణం పూర్తి
- 2,198 మీటర్లు మంజూరు

బాపట్లటౌన్: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ముఖ్యంగా పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోంది. కేవలం ఇంటి స్థలం ఇచ్చి చేతులు దులుపుకోకుండా పునాది స్థాయి నుంచి గృహప్రవేశం వరకు అడుగడుగునా అండగా నిలుస్తోంది. దీనిలో భాగంగా విద్యుత్ మీటర్లను ఉచితంగా అమర్చుతూ లబ్ధిదారుల ఇళ్లల్లో ఆనందాల కాంతులు వెదజల్లుతోంది. దీనికోసం విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారు. ఇళ్లకు మీటర్లు అమర్చడమే కాకుండా జగనన్న కాలనీల్లో అవసరమైన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులూ చేస్తున్నారు. విద్యుత్‌శాఖ బాపట్ల జిల్లా ఎస్‌ఈ గువ్వల ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. అధికారులు ప్రత్యేక బృందంగా జిల్లాలోని డివిజన్ల వారీగా లేఅవుట్లను పరిశీలిస్తూ వీలైనంత వరకు రోడ్లకు ఇరు వైపులా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు నీటి అవసరాలకు కరెంట్ సదుపాయంతోపాటు, ప్రతి ఇంటికీ ఉచితంగా విద్యుత్ కనెక్షన్ మీటర్లను అందజేసేలా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఇళ్లకు దాదాపుగా విద్యుత్ మీటర్లు అమర్చేశారు. మిగిలిన ఇళ్లకూ త్వరలోనే అమర్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రతి వారం ఈ అంశంపై ప్రగతి నివేదికలను క్షేత్రస్థాయి నుంచి తెప్పించుకుంటూ, టెలి కాన్ఫరెన్స్ ద్వారా సూచనలను, ఆదేశాలను జారీ చేస్తున్నారు.



జగనన్న కాలనీలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఆంజనేయులు

నిర్మాణాలు పూర్తయిన వెంటనే..



జగనన్న కాలనీల్లోని ఇళ్లకు నూరుశాతం ఉచితంగా విద్యుత్ మీటర్లను అందజేస్తున్నాం. గృహ నిర్మాణాలు పూర్తిచేసిన వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోంది. అది ముగిసిన అనంతరం విద్యుత్ మీటర్లను అందజేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ మేలు చేస్తున్నాం.

– గువ్వల ఆంజనేయులు, జిల్లా విద్యుత్‌శాఖ ఎస్‌ఈ

జగనన్న కాలనీల్లో గృహాలకు విద్యుత్ మీటర్ల ఏర్పాటు ఇలా

నియోజకవర్గం	పూర్తిచేసిన గృహాలు	రిజిస్ట్రేషన్ చేసినవి	మీటర్లు అందించినవి
అద్దంకి	553	429	413
పర్చూరు	343	273	272
బాపట్ల	855	550	478
చీరాల	616	461	432
రేపల్లె	913	508	508
వేమూరు	424	147	95
మొత్తం	3,704	2,368	2,198

పసుపు రైతుకు పసిడి ధర

క్వింటాకు రూ.6,850 మద్దతు ధర

- కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు : పసుపు రైతులకు బంగారం లాంటి ధర దక్కాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చెప్పారు. గురువారం మండలంలోని దోనేపూడి సొసైటీ బ్యాంక్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పసుపు రైతులు అధిక పెట్టుబడులు పెట్టి వ్యయప్రయాసలకోర్చి పంటను పండిస్తే సరైన ధర లభించకపోవడం బాధాకరమని, అందుకే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి పసుపు రైతుల సమస్యను తీసుకువెళ్లి కొనుగోళ్ల కేంద్రాలు ఏర్పాటుకు కృషి చేశామని వివరించారు. బయట మార్కెట్‌లో క్వింటా పసుపు కొమ్ములు రూ.4, 500 నుంచి రూ. 5,500 వరకు మాత్రమే పలుకుతుండగా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రూ.6,850కి కొంటున్నట్టు వెల్లడించారు. సుమారు రూ.2 వేల వరకు ధర వ్యత్యాసం ఉందని వివరించారు. కార్యక్రమంలో వేమూరు మార్కెట్‌యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, కొల్లూరు వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు ఇంటూరి ప్రవీణ్, పాలిమట్ల ఆనంద్ కిశోర్, దోనేపూడి సొసైటీ బ్యాంక్ చైర్మన్ నిమ్మగడ్డ శివరామకృష్ణప్రసాద్, మార్క్‌ఫెడ్ డీఎం కరుణ, జీడీసీసీ బ్యాంక్ ఏజీఎం జయలక్ష్మి, హార్టికల్చర్ డీహెచ్‌ఓ జన్నెమ్మ, తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు, పోతార్లంక ఎత్తిపోతల పథకం చైర్మన్ చంటి తదితరులు పాల్గొన్నారు.



పసుపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

‘గురు’తర బాధ్యతలు

- విజయవంతంగా బదిలీలు, ఉద్యోగోన్నతులు
- కొత్త పాఠశాలల్లో హెచ్ఎంల బాధ్యతల స్వీకారం
- బుధవారం రాత్రి ఆన్‌లైన్‌లో ఉత్తర్వులు జారీ
- ఒక్కరోజులో 285 మందికి స్థానచలనం
- నేటి నుంచి స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలకు ఉత్తర్వుల జారీ



గుంటూరులో ఆన్‌లైన్ ద్వారా వెబ్ ఆప్షన్లు నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తయింది. లాంగ్ స్టాండింగ్, రిక్వెస్ట్ బదిలీలు కోరుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు పూర్తి చేసిన విద్యాశాఖ బదిలీ, ఉద్యోగోన్నతి ఉత్తర్వులను ఆన్‌లైన్‌లో పొందుపర్చింది. ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తూ బదిలీల్లో స్థాన చలనం పొందిన ప్రధానోపాధ్యాయులు విద్యాశాఖ ఆదేశాలతో గురువారం ఉదయం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని నూతన పాఠశాలలకు వెళ్లి విధుల్లో చేరారు.

గురువారం ఉదయం హెచ్ఎంలు అందరూ పాఠశాలల్లో చేరాలని ఇచ్చిన ఆదేశాలతో ఎక్కడికక్కడ పాఠశాలల్లో కొత్త హెచ్ఎంలు కొలువు దీరారు. లాంగ్ స్టాండింగ్ విభాగంలో ఐదేళ్లుగా ఒకే చోట పని చేస్తున్న హెచ్ఎంలకు ప్రస్తుత బదిలీల్లో స్థాన చలనం కలిగింది. అలాగే ఒకే పాఠశాలలో ఎనిమిది విద్యాసంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులు సైతం తప్పనిసరి బదిలీ విధానంలో నూతన పాఠశాలల బాట పట్టారు. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 285 మంది హెచ్ఎంలకు స్థాన చలనం కలిగింది. వీరిలో 243 మంది బదిలీ కాగా, మరో 42 మంది హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతి పొందిన వారు ఉన్నారు.

వివిధ కేడర్లలో 3,350 మందికి స్థాన చలనం

బదిలీలు, ఉద్యోగోన్నతుల ద్వారా లాంగ్ స్టాండింగ్ విభాగంలో వివిధ కేడర్ల వారీగా 3,350 మంది ఉపాధ్యాయులకు స్థాన చలనం కలగనుండగా, రిక్వెస్ట్ బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు 2,938 మంది ఉన్నారు. హెచ్ఎంలకు బదిలీ, ఉద్యోగోన్నతి ప్రక్రియ పూర్తవగా, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు శుక్రవారం నుంచి బదిలీ, ఉద్యోగోన్నతి ఉత్తర్వులు జారీ కానున్నాయి.

గురువారం రాత్రితో వెబ్ ఆప్షన్లకు ముగిసిన గడువు

బదిలీ కోరుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు గురువారం రాత్రితో గడువు ముగిసింది. శని, ఆదివారాల్లో ఎస్జీటీలకు బదిలీ ఉత్తర్వులు జారీ కానున్నాయి. తదుపరి పాఠశాలలు తెరిచిన రోజున బదిలీ, ఉద్యోగోన్నతి ద్వారా స్థాన చలనం పొందిన ఉపాధ్యాయులందరూ కొత్త బడుల్లో విధుల్లో చేరాల్సి ఉంది.

తాగు, సాగునీటి సమస్యలపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు

కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుందామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా చెప్పారు. జలవనరులు, పశ్చిమ కృష్ణా కాలువ నిర్వహణపై అధికారులతో గురువారం ఆయన తన చాంబర్లో సమావేశమయ్యారు. బాపట్ల జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో 49 టీఎంసీల నీరు తాగు, సాగునీటి అవసరాలకు కావాల్సి ఉందని, తొలుత మున్సిపాలిటీలలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, గ్రామీణ ప్రాంతాలలోని తాగునీటి చెరువులు నింపాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీటి అవసరాల కోసం నాలుగు టీఎంసీలు అవసరమని చెప్పారు.

పంట కాలువల మరమ్మతులు చేపట్టాలి

ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఇబ్బంది పడకుండా కాలువల వార్షిక మరమ్మతులను ఇంజినీరింగ్ అధికారులు చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. వ్యవసాయ ఖరీఫ్ సీజన్ వార్షిక ప్రణాళిక మేరకు బాపట్ల జిల్లాకు 67 టీఎంసీల నీటి విడుదలకు ప్రభుత్వం ఆమోదించిందని వివరించారు. జిల్లాలో 3.79 లక్షల ఎకరాల ఆయకట్టు భూములకు కాల్వల ద్వారా సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. ఆయకట్టు చివరి భూములకూ సాగు నీరు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. కాల్వల్లో పూడిక తీత, మరమ్మతు పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్టు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని సాగర్ కాల్వలకు 66 ప్రాంతాల్లో మరమ్మతులకు రూ.6.8 కోట్లు మంజూరైనట్టు వివరించారు. మురుగునీటి కాల్వల నిర్వహణ శాఖ ద్వారా రూ.2.75 కోట్లతో 29 పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. నామినేషన్ పద్ధతిలో కొన్ని, టెండర్ విధానంలో మరికొన్ని చేపడుతున్నట్లు వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.హెచ్. శ్రీధర్, జలవనరుల శాఖ ఎస్‌ఈ మురళీకృష్ణ, డీఈ ఎస్.కె.వి.ప్రసాదరావు, పశ్చిమ కెనాల్ ఈఈ ఎస్.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



తాగు,సాగు నీటిపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

‘సేద్య విద్య’యోత్సవం

ఉత్సాహంగా బాపట్ల వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం

బాపట్ల అర్బన్: బాపట్ల వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం గురువారం రాత్రి ఉత్సాహంగా జరిగింది. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి. శ్రీనివాసరావు అధ్యక్షతన బీవీ నాథ్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టర్ సి.హెచ్. శ్రీధర్ పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు వ్యవసాయంలో కొత్త ఆవిష్కరణల వైపు మొగ్గు చూపాలని సూచించారు. మరో ముఖ్యఅతిథి పూర్వ విద్యార్థి, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ పి. కామేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు. విద్యార్థులు వినూత్న ఆలోచనా విధానం అలవర్చుకోవాలన్నారు. అనంతరం కళాశాల సంచిక ‘హరిత-2023’ను ఆవిష్కరించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బంగారు పతకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. 2017-2021 బ్యాచ్ బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థి ఎ.నైమిషకు ఐదు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. చివరిగా సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులు ఆహూతులను అలరించారు.



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్

తెనాలి మున్సిపల్ రెండో వైస్ చైర్‌పర్సన్‌గా నాగవేణి

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ రెండో వైస్ చైర్‌పర్సన్‌గా 40వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ అత్తోట నాగవేణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ ప్రకటించారు. అనంతరం నాగవేణితో ప్రమాణ స్వీకారం చేయించారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం జరిగిన ప్రత్యేక సమావేశంలో వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారి గీతాంజలి శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. 25వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య 40వ వార్డు కౌన్సిలర్ అత్తోట నాగవేణి పేరును ప్రతిపాదించారు. వెంటనే 31వ వార్డు కౌన్సిలర్ గోగిరెడ్డి మానసారెడ్డి బలపరిచారు. సభ్యుల నుంచి అభ్యంతరం లేకపోవడంతో నాగవేణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గీతాంజలి శర్మ ప్రటించారు. అనంతరం నాగవేణితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎక్స్ అఫిషియో సభ్యుని హోదాలో సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కమిషనర్ ఎం.జశ్వంతరావు తదితరులు నాగవేణిని సన్మానించారు. అనంతరం మాజీమంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఐతానగర్‌లోని లింగారావు సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇదిలా ఉంటే వైస్ చైర్‌పర్సన్ ఎన్నికకు ఎనిమిది మంది టీడీపీ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ నాగవేణి ఎన్నిక సామాజిక న్యాయానికి నిదర్శనమని పేర్కొన్నారు. నాగవేణి మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గానికి వైస్ చైర్‌పర్సన్ పదవి ఇవ్వడం హర్షణీయమని చెప్పారు.



నాగవేణికి నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి గీతాంజలిశర్మ

సమ్మర్ ప్రత్యేక రైళ్లు కేటాయింపు

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే ప్రయాణికుల కోసం గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా కాచిగూడ-నరసాపూర్-కాచిగూడ మధ్య సమ్మర్ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్ కుమార్ గురువారం వెల్లడించారు. కాచిగూడ-నరసాపూర్(07653) ప్రత్యేక రైలు ఈ నెల 8వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నడుస్తుందని తెలిపారు. ఈ రైలు కాచిగూడ స్టేషన్ నుంచి రాత్రి 8.30 గంటలకు బయలు దేరి మరుసటిరోజు ఉదయం 8.35 గంటలకు నరసాపూర్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. నరసాపూర్-కాచిగూడ(07654) ప్రత్యేక రైలు ఈనెల 9వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నడుస్తుందని తెలియజేశారు. ఈ రైలు నరసాపూర్ స్టేషన్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 4.50 గంటలకు కాచిగూడ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు.

వినుకొండ వద్ద రైల్వేగేటు మూసివేత

సీనియర్ డీసీఎం దినేష్ కుమార్ ఆర్‌యూబీ ద్వారా ట్రాఫిక్ మళ్లింపు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని గుంతకల్ స్టేషన్ మధ్య రైల్వే డబ్లింగ్ లైను పనులు జరుతున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఆరుగంటల నుంచి రాత్రి 12 గంటల వరకు వినుకొండ యార్డులో చీకటిగలపాలెం, వినుకొండ స్టేషన్ల మధ్య రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్‌ను మూసి వేయడం జరుగుతుందని సీనియర్ డీసీఎం దినేష్ కుమార్ గురువారం వెల్లడించారు. స్థానికులు, ప్రయాణికులు, వాహనదారులు గమనించి సహకరించాల్సిందిగా కోరారు. రైల్వే లెవల్ క్రాసింగ్ గేటును మూసి వేసినందున అటుగా ప్రయాణించాల్సిన వాహనాలు వినుకొండ టౌన్ నుంచి ఏనుగుపాలెం వరకు 1.కి.మీ సమీప దూరంలో గల ఆర్‌యూబీ ద్వారా ట్రాఫిక్‌ను మళ్లించడం జరిగిందని తెలియజేశారు.

షోరూంలో 12 బైకులు మాయం

మార్టూరు: ఇంటిదొంగను ఈశ్వరుడైనా పట్టలేడని సామెత మనందరికీ తెలుసు. సరిగా ఇలాగే ఓ షోరూరంలో పనిచేసే చేసే సిబ్బందే బైకులను మాయం చేశారు. ఈఘటన మార్టూరు జాతీయ రహదారి పక్కన గల క్రిస్టల్ హోండా షోరూంలో జరిగింది. దీనిపై గురువారం రాత్రి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు నమోదైంది. ఎస్సై కమలాకర్ వివరాల మేరకు.. హోండా షోరూం తరఫున ఏజెంట్‌గా పనిచేసే కత్తుల ఉదయ్ రేవంత్ గత ఆర్థిక సంవత్సరంలో యాజమాన్యానికి తెలియకుండా 12 బైకులు ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు ఇటీవల నిర్వహించిన ఆడిట్‌లో వెలుగు చూసింది. ఉదయ రేవంత్‌కు అతని సోదరుడు కత్తుల తేజ సమీప బంధువులు కత్తుల చక్రి సౌభాగ్యలక్ష్మి సహకరించినట్లు షోరూం యాజమాన్యం గుర్తించింది. ఈ క్రమంలో షోరూం మేనేజర్ మోదడుగుల పోలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాకిన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వక్ఫ్ బోర్డు భూములకు వేలం

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం కృషి


వక్ఫ్ భూములకు వేలం నిర్వహ్వహిస్తున్న అధికారులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో వక్ఫ్ బోర్డుకు చెందిన రెండు పీర్ల చావిడిల 16 ఎకరాల వ్యవసాయ భూములను గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆ శాఖ అధికారులు వేలం నిర్వహించారు. ఈ వేలంలో కనగాల, భట్టిప్రోలు, అద్దేపల్లి, వెల్లటూరు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్, వక్ఫ్ బోర్డు అధికారుల ఆదేశాల మేరకు ఈ వేలం నిర్వహించామని అధికారులు తెలిపారు. సర్వే నెంబర్ 156లో గల 10.15 ఎకరాల భూమిని అత్యధిక ధరకు అద్దేపల్లికి చెందిన గౌస్‌బేగ్ సొంతం చేసుకున్నారు. సర్వే నెంబర్ 351/2 గల 2.81 ఎకరాల భూమిని భట్టిప్రోలుకు చెందిన అబ్దుల్ తబ్రేజ్ వేలంలో సొంతం చేసుకున్నారు. ప్రభుత్వ వక్ఫ్‌బోర్డుకు చెందిన వ్యవసాయ భూముల్లో ఇప్పటి వరకు అనధికారికంగా సాగు చేసిన వారు వేలంలో పాల్గొనలేదు కాబట్టి వారు పంట భూముల్లో అడుగుపెట్టడానికి వీలులేదని, వేలం ద్వారా పొలాలు సొంతం చేసుకున్న వారికి హద్దులు వేసి పొలాలను స్వాధీనం చేయాలని తహసీల్దార్ ఎంఎల్ శ్రావణ్‌కుమార్‌కు వక్ఫ్‌బోర్డు అధికారులు సూచించారు. ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం ప్రతి ఏటా సమీక్షలు నిర్వహించి పేదలకు ప్రయోజనం చేకూరే విధంగా కృషి చేస్తున్నదని వక్ఫ్‌బోర్డ్ ఇన్‌స్పెక్టర్ ముక్తార్ బాషా తెలిపారు. అవగాహన లేక వక్ఫ్ భూముల విషయంలో వివాదాలు సృష్టించే విధంగా చర్యలు చేపట్టే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. పీర్ల చావిడల బాధ్యత పంట భూములు సాగు చేసే వారిపైనే ఉంటుందని, ఎలాంటి వివాదాలు, గొడవలకు ఆస్కారం లేకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏమైనా సందేహాలు ఉంటే గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వక్ఫ్‌బోర్డ్ సంక్షేమ శాఖ కార్యాలయంలో వివరాలు తెలుసుకోవచ్చునని తెలిపారు. భట్టిప్రోలు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ వేలంలో వక్ఫ్ బోర్డు రాష్ట్ర అడిషనల్ సెక్రటరీ మహ్మద్ అలీ, జిల్లా ఇన్‌స్పెక్టర్ ముక్తార్ బాషా, తహసీల్దార్ శ్రావణ్ మార్, ఆర్ఐ శివరామకృష్ణ, వీఆర్వోలు రత్నాకర్, గ్రేసమ్మ, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్, వక్ఫ్‌బోర్డు జిల్లా సెక్రటరీ సయ్యద్ నబీ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ రైతుపక్షపాతి ప్రభుత్వం

బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి


అరక పట్టి ఏరువాక సాగుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్లఅర్బన్: రైతు పక్షపాతి వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని బాపట్ల శాసనసభ్యుడు కోన రఘుపతి అన్నారు. బాపట్ల మండలం పిన్నిబోయినవారిపాలెం గ్రామంలో గురువారం ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తొలుత కోన రఘుపతి భూమి పూజ నిర్వహించారు. అనంతరం నాగలి పట్టి పొలాన్ని దున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి చూపించిన బాటలోనే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నడుస్తున్నదని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, మెరుగైన సేవలు అందుతున్నాయని తెలిపారు. రైతుకు సీజన్‌లో పంటనష్టం వాటిల్లితే గత ప్రభుత్వంలో అరకొరగా నష్టాన్ని అందించే వారని కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పంట నష్టపోయిన వెంటనే రైతుకు నష్టపరిహారాన్ని అందించటం జరుగుతుందన్నారు. రైతులకు భరోసాను కల్పించిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైస్ చైర్మన్ పిన్నిబోయిన ప్రసాద్, మార్కెట్ యార్డు డైరెక్టర్లు, రైతు సంఘం అధ్యక్షులు దశరథ మహారాజు, జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్, జెడ్పీటీసీ సభ్యులు పిన్నిబోయిన ఎస్తేరురాణి, ఎంపీపీ చిన పోతుల హరిబాబు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వడ్డిముక్కల డేవిడ్, కన్నా మామిడియ్య, కొక్కిలిగడ్డ తదితరులు పాల్గొన్నారు.

పశుపోషణలో యాజమాన్య పద్ధతులు తప్పనిసరి


మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి హనుమంతరావు

చినగంజాం: పశుపోషణలో యాజమాన్య పద్ధతులు విధిగా పాటించడం ద్వారా పశు పోషకులకు లబ్ధి చేకూరుతుందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి మద్దు హనుమంతరావు పేర్కొన్నారు. గురువారం చింతగుంపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పశు బీమా పథకం, పశుగ్రాస విత్తనాలు, మేలైన పశు యాజమాన్యం, దూడల పెంపకం గురించి వివరించారు. శిబిరంలో 12 పశువులకు సాధారణ చికిత్స, 31 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స, 67 పశువులకు నట్టల నివారణ మందు వేశారు. కార్యక్రమంలో చీరాల పశువైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ నజ్జా చిట్టిబాబు, సంతరావూరు పశువైద్యాధికారి టీ శివారెడ్డి, చినగంజాం పశు వైద్యాధికారి బీ కిరణ్‌కుమార్, రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ పేర్లి రత్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా శిక్షణ శిబిరాలతో మారుతోన్న కెరీర్

సెట్ సీఈఓ పల్లవి

గుంటూరు వెస్ట్: దేశంలో పేరొందిన క్రీడాకారులు ముందుగా శిక్షణ శిబిరాలతోనే తమ కెరీర్‌ను ప్రారంభించారని సెట్ సీఈఓ ఎస్.పల్లవి తెలిపారు. గత నెలరోజులుగా స్థానిక బీ ఆర్ స్టేడియంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరాలు గురువారంతో ముగిశాయి. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పల్లవి మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ తీసుకున్న చిన్నారులు భవిష్యత్‌లో కూడా తమ సాధన కొనసాగించాలన్నారు. దీనికి తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉందని వెల్లడించారు. అనంతరం శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబర్చిన చిన్నారులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

పీడీ శంకర్‌నాయక్


పంట కాలువల పనులు పరిశీలిస్తున్న పీడీ, ఎంపీడీవోలు

కారంచేడు: ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ వై శంకర్‌నాయక్ పేర్కొన్నారు. కారంచేడు మండలంలో 2023–24 సంవత్సరాలకుగాను రూ.6.8 కోట్ల నిధులతో ఉపాధి హామీ పథకం పనులు చేపట్టినట్లు మెప్మా పీడీ తెలిపారు. గురువారం ఆయన మండల కేంద్రం కారంచేడు పరిధిలో చీరాల–కారంచేడు మార్గంలో చేస్తున్న పంట కాలువల అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ ఏడాది మండలంలో 2.94 లక్షల పనిదినాలు ఉండేలా లక్ష్యంగా సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. వీటిలో ఇప్పటికే 1.48 లక్షల పనిదినాలు పూర్తి చేయడంతో సిబ్బందిని పీడీ అభినందించారు. కారంచేడు చర్చి రోడ్డు వద్ద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన నీడ కోసం టెంట్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రోజుకు రూ 272 వేతనం అందేలా పనిచేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన పనిని, కొలతల ప్రకారం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో డీ విజయలక్ష్మి, ఏపీఓ ప్రదీప్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే ఆస్పత్రులు నిర్వహించుకోవాలి

జిల్లా వైద్య బృందం


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్య బృందం

చీరాల రూరల్: పట్టణంలోని అన్ని వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లు నిబంధనల ప్రకారం పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ పేర్కొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారుల బృందం గురువారం పట్టణంలోని పలు వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లను పరిశీలించారు. శంకర్ ల్యాప్రోస్కోపి అండ్ ఇన్‌ఫెర్టిలిటీ సెంటర్ నందు రెండు స్కానింగ్ మిషన్లను, ప్రేమ హాస్పిటల్‌లో స్కానింగ్ మిషన్‌ను పరిశీలించారు. ఆయా పరికరాలను అధికారికంగా రిజిస్టర్ చేయించుకుని ప్రమాణాలకు అనుగుణంగా పనిచేస్తున్నట్లు గుర్తించామని డీఎంహెచ్‌వో తెలిపారు. హాస్పిటళ్లలో అందిస్తున్న సేవలను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. డీఎంహెచ్‌వో వెంట జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యుపీఐ మోసాలపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



ప్రజలకు అవగాహన కల్పించేందుకు విడుదల చేసిన పోస్టర్

బాపట్లటౌన్: యూపీఐ మోసాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో యూపీఐ పేమెంట్స్‌లో జరిగే అక్రమాలను క్షుణ్ణంగా వివరించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఎవరైనా దుకాణాలు, షాపుల వద్ద వస్తువులు కొనుగోలు చేసి నగదు చెల్లిస్తామని, మీ ఫోన్, యూపీఐ పిన్ అడుగుతున్నారంటే మోసం చేస్తున్నారని గ్రహించాలన్నారు. డబ్బులు స్వీకరించాలనుకుంటే పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం లేదన్నారు. చాలా వరకు యూపీఐ మోసాలు యూజర్లు అప్రమత్తంగా లేకపోవడం వల్లే జరుగుతున్నాయన్నారు. ఒకసారి డబ్బులు పోయిన తర్వాత తిరిగి పొందడం చాలా కష్టమన్నారు. దుకాణదారులు అపరిచిత వ్యక్తులకు యూపీఐ పిన్ నెంబర్ చెప్పవద్దని, యూపీఐ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒక్కసారి సైబర్ నేరస్తుల వలలో పడి డబ్బులు పోగొట్టుకుంటే తిరిగిపొండటం చాలా కష్టమన్నారు. టెక్నాలజీ పెరిగిపోయిన తర్వాత మనీ ట్రాన్స్‌ఫర్ చేయడం, ఆన్‌లైన్ పేమెంట్స్ చేయడం చాలా సులువైపోయిందన్నారు. స్మార్ట్‌ఫోన్‌లో పేమెంట్స్ యాప్స్ ఉపయోగించి సులువుగా లావాదేవీలు చేస్తున్నారన్నారు. లక్షల రూపాయల బదిలీ కూడా క్షణాల్లో జరిగిపోతున్నాయన్నారు. ఎవరైనా తెలియని వ్యక్తులు మీ దుకాణాలు, షాపుల వద్ద వస్తువులు కొనుగోలు చేసి ఫోన్ పే, గూగుల్ పే, ఇతర పేమెంట్ యాప్ ల ద్వారా నగదు చెల్లిస్తామని మీ మొబైల్ ఫోన్ తీసుకొని మీ ఫోన్ నుంచి ముందుగా రూ.1 పంపిన తర్వాత యూపీఐలో మనీ రిక్వెస్ట్ పంపి మీ అకౌంటులోని ఉన్న డబ్బు మొత్తం దొంగిలిస్తారన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింక్స్ ఎట్టిపరిస్థితుల్లో క్లిక్ చేయకూడదని, ఇలాంటి లింక్స్‌తోనే మోసాలు ఎక్కువగా జరుగుతుంటాయన్నారు. మోసానికి గురైతే వెంటనే సంబంధిత బ్యాంక్, మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కి వెళ్లి ఫిర్యాదు చేయాలని, సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

యువకుడిపై హత్యాయత్నం



కర్లపాలెం: ఓ యువకుడిపై హత్యాయత్నం జరిగిన సంఘటన బాపట్ల జిల్లా కర్లపాలెం మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు, కర్లపాలెం ఏఎస్ఐ సాంబశివరావు తెలిపిన వివరాల మేరకు రాజీవ్‌నగర్ గ్రామానికి చెందిన తాతపూడి యోహాను మాంసం విక్రయిస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన వంగివరపు ఏసురత్నంతోపాటు తాతపూడి ఏసురత్నంలు తన తమ్ముడైన యోహాను వద్ద పనిచేస్తుంటారు. వ్యాపారానికి సంబంధించిన నగదు ఎక్కువగా వాడుకుంటున్నాడని, సరిగా ఇవ్వటం లేదని తాతపూడి ఏసురత్నంను అతని తమ్ముడు యోహాను ఇటీవల పని నుంచి తొలగించాడు. వంగివరపు ఏసురత్నం తనపై చాడీలు చెప్పటం వలనే తమ్ముడు యోహాను తనను పని నుంచి తొలగించాడని తాతపూడి ఏసురత్నం మనసులో పెట్టుకున్నా డు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం తాతపూడి ఏసురత్నం వంగివరపు ఏసురత్నంతో గొడవపడి కత్తితో మెడపై పొడిచి పారిపోయాడు. తీవ్ర రక్త స్రావమైన వంగివరపు ఏసురత్నంను స్థానికులు వైద్యం కోసం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. తాతపూడి ఏసురత్నం 2009 లో తన భార్యను చంపిన కేసులో పదేళ్ల జైలు శిక్ష అనుభవించాడని తెలిపారు. ఈఘటనపై కేసు నమోదు చేసి తాతపూడి ఏసురత్నంను అదుపులోకి తీసుకుని, దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ వెంకటేశ్వర్లు, కర్లపాలెం ఏఎస్ఐ సాంబశివరావు తెలిపారు.

బాల్య వివాహాలు సమాజానికి చేటు

గుంటూరు వెస్ట్: ముక్కుపచ్చలారని చిన్నారులకు సాంప్రదాయాల పేరుతో బరువు, బాధ్యతలను దించుకోవాలనే సాకుతో బాల్య వివాహాలు చేస్తున్నారని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఆదిలక్ష్మి, పద్మావతి పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కైలాస సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్, సౌజన్యంతో చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్లానింగ్ అండ్ కోఆర్డినేషన్ సమావేశం జరిగింది.

విచారణలు త్వరగా చేపట్టేందుకే మేళా


ఆర్ఐతో మాట్లాడుతున్న ఏఎస్పీ సుప్రజ

నగరంపాలెం: పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న ఓఈలను త్వరితగతిన పరిష్కరించుకుంటే భవిష్యత్‌లో వచ్చే ఉద్యోగోన్నతులు, ఇంక్రిమెంట్ తదితర వాటికి అవకాశం ఉంటుందని జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ అన్నారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో గురువారం పోలీస్‌శాఖ పోలీస్ సిబ్బందికి మౌఖిక విచారణ మేళా జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో కొందరి పోలీస్ అధికారులు శాఖాపరమైన విచారణలు, క్రమశిక్షణ, విధుల్లో అలసత్వం, సర్వీస్ నిబంధనల ప్రకారం విధులకు, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించడం తదితర విషయాలపై విచారించి, వాస్తవాల ఆధారంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దీంతో విచారణలు త్వరగా చేపట్టాలనే ఉద్దేశ్యంతో ఈ మేళాను నిర్వహించినట్లు తెలిపారు. డీఎస్పీలు జనార్ధన్‌రావు, కేసీహెచ్. రామారావు, ఆర్ఐ.రాఘవయ్య, ఏఏఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి జగనన్న కృషి


పోస్టర్‌ను చూపుతున్న జిలాని

వక్ఫ్‌బోర్డ్ జిల్లా అధ్యక్షుడు జిలాని

గుంటూరు రూరల్: ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కృషి చేసిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని వక్ఫ్‌బోర్డ్ జిల్లా అధ్యక్షుడు జిలాని పేర్కొన్నారు. గురువారం 40వ డివిజన్ పెదపలకలూరులోని మసీదులో ముస్లిం పెద్దలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగనన్న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత మసీదుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారని తెలిపారు. అదేవిధంగా ముజావర్‌లకు నిధులు అందించారని వివరించారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి జగనన్న చేసిన కృషిని వివరించారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, తదితర పథకాలతో ముస్లిం మైనార్టీ పిల్లలకు విద్యాపరంగా జగనన్న చేస్తున్న ఆర్థిక సాయాన్ని వివరించారు. గతంలో చంద్రబాబు ముస్లిం యువకులపై దేశద్రోహం కేసులు బనాయించాడని ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశాడన్నారు. ఏనాడు చంద్రబాబు ముస్లింలకు చేసింది ఏమీ లేదని, ఎన్నికలు వస్తున్నాయని నేడు ఓట్ల కోసం ప్రజలకు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నాడని వివరించారు. గతంలో చంద్రబాబు ఎన్నికల సమయంలో 600 హామీలు ఇచ్చి ఒక్కటీ అమలు చేయలేదని తెలిపారు. చంద్రబాబు మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని రానున్న ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలు జగనన్నకు అండగా ఉండి జగనన్న మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సైనికుల వలే కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డ్ సెక్రటరీ సమీవుల్లా, డైరెక్టర్ కరిముల్లా, జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు ఘన్‌సైదా, సెక్రటరీ అమానుల్లా, ఖాసిం, అబ్దుల్ కరీం బాషా, జానీ, ఇమాంసా, జిలాని, మాబుబాషా, సుబాని ముస్లిం మైనార్టీ పెద్దలు పాల్గొన్నారు.